# కాలం చేసిన మనిషి

ఆనందరావుకు చిన్నప్పటినుంచీ కూడ పరుగెత్తటంలో మహా సరదా. గుర్రం లాగ, తల యెగర వేస్తూ రొప్పుతూ, ఆయాస, పడుతూ. రెండు చేతులూ ముందుకూ వెనక్కూ ఊగిస లాడిస్తూ ఎంతో దూరం పరుగెత్తుతూ ఉండేవాడు. ఐతే అదేం చిత్రమో, అతను యెంత పరుగెత్తినా, మళ్ళీ తాను ఉన్న చోటుకే వచ్చి ఊడిపడేవాడు. ఊపు పెంచుతే యింకా గభాలున తాను బయలు దేరిన చోటుకే వచ్చేశేవాడు. అప్పటికి అతను గెలిచాడని, జనం బహుమతులు యిస్తూ ఉండేవాళ్ళు. ఆనందరావు కూడా తాను జయించినట్లే గర్వపడుతూ వుండేవాడు. ఎంత మందినైనా సరే యిట్టే ఓడించగలనని, వెనక్కు నంపించెయ్యగలనని, ధైర్యం, ధీమా ఆయన్ను అంటి పెట్టుకుని ఉన్నాయి.

కాని, యీనాడు, ఆనందరావుకు నిస్పృహ, నిరాశ వచ్చేస్తున్నాయి. అనాటి పరుగుకు, యీనాటి కాలంతో పాటు పోటీ పడే

పరుగుకు చాలా తేడా కనిపిస్తోంది. ఎంత పరుగెత్తినా, అడుగు ముందుకు పోయినట్టు కనిపించటంలేదు. స్తబ్ధత యేర్పడినట్టు గమనుస్తున్నాడు. ఉన్న చోటే ఉండటం అనేది ఆయన వంటికి పడదు. కాని యేంచేస్తాడు పాపం, కదల్లేక పోతున్నాడు. ఆయన కంటికి కదలిక కనబడటం లేదు ఇప్పుడు తనతో పరుగెత్తే వాళ్ళు యెక్కువయి పోయారు. తనకంటె ముందుగానే భార్య నిద్ర లేస్తుంది ఇంటి పనులు గబ గబ చేసుకుంటూ పోతుంది. పిల్లలు చలాకీగా బళ్ళోకి పోతారు. తాను నిద్ర లేచేటప్పటికి అందరూ కూడా తొందరగా కదులుతూనే ఉంటారు. తానే వెనకబడి పోతూ వుంటాడు. అది ఆయనకు యిష్టం ఉండదు. ఇంటా బైటా కూడా ఆయనే గెలవాలని గట్టికోరిక ఉంది. లేచీలేవటంతోనే అంతాకూడా, తనకంటె యెంతో ముందుగా ఉన్నట్టు కనిపిస్తూ ఉంటారు. తానే వెనకబడి పోతూ వుంటాడు, ఎప్పటి కప్పుడు వాళ్ళను కలవాలంటే కుదరటం లేదు. అప్పటికి గబ గబ లేస్తూ, చకచక ముందుకు సాగుతూనే ఉంటాడు. కాని వాళ్ళతో కలవ లేక పోతున్నాడు. అదే ఆయన నిరుత్సాహం. ఎవరైనా తనకంటె ముందుగా పోతే సహించలేక పోయేవాడు ఆరోజుల్లో ఆ అసహనం అట్లాగే ఉండి పోయింది.

ఏమిటి దీనికి కారణం అనుకుంటూ ఆట్టే ఆలోచిస్తూ ఉంటాడు. ఎవ్వరూ కూడా తనకంటె ముందుకు పరుగెత్త లేరు ఇది నిశ్చయం తన కంటికికనిపించే యీ వ్యక్తులు యెవ్వరూ కూడా పరుగు పందెంలో తనను ఓడించ లేరు. ఇది ఖాయమే

అయితే తాను పడుతున్నదికాలంతో పోటీ.ఎంతమందినైనా వెనక పడెయ్యేచ్చుగాని,కాలాని కంటె ముందు వెళ్ళటం కష్టం. అసలు కారణం ఊహించుకుని తనలో తాను సంతృప్తి పడుతున్నాడు.

అయినా ఆయన కోరిక తీరటం లేదు. గభాలున ఆనాడు అందరి కంటె ముందుగానే లేచి, భార్య, పిల్లల్ని వెనక్కు నెట్టేశాడు. చాలా తృప్తిగా నిట్టూర్చాడు. ఆయనకు యెంతో ఉత్సాహం. ఆనందం కలిగినాయి. ఒకరోజు కాదు. రోజురోజుకు, అలవాట్లు మార్చుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు. త్వరత్వరగా పనులు పూర్తి చేసుకుని, ఆఫీసుకి అందరికంటె ముందుగానే వెళుతున్నాడు అక్కడ పనులు కూడా యిట్టే ముగించేసి గడియారం అయిదు కొట్టబోతుందనగానే చివాలున లేచి. యింటికి ప్రయాణమవుతూ వుంటాడు. ఎంత ప్రయత్నం చేసినా, రోజుకు ఒకసారైనా కాలంతో ఓడిపోతూనే వుంటాడు. ఎక్కడో అక్కడ కాలం ఆయన్ను దాటేస్తూనే వుంటుంది. గడియారం వంక చూడాలంటే గుండె దడగా వుంటుంది. మొహానికి చెయ్యి అడ్డు పెట్టుకుని వేళ్ళ సందుల్లోంచి, గడియారం ముల్లును చూస్తూవుండే, చిన్న ముల్లు గిర్రున తిరిగి పోతున్నట్లు కనిపించి హడలిపోతూ వుంటాడు.

ఉదయాన్న గోడ గడియారం ఆరుగంటలు కొట్టేటప్పటికి, గుండె గుభేలు మంటుంది. అప్పుడే అరయిందా అని ఆశ్చర్యపోతూ వుంటాడు. ఎంత ప్రయత్నం చేసినా, ఉదయం అయిదున్నర గంటలకే లేచినా, ఆరు గంటలు కొట్టె లోపల, కాఫీ తాగుదామంటే కుదరటంలేదు. ఆయన కాఫీకప్పు చేతిలోకి తీసుకోక మునుపే ఆరుగంటలు ఠంగు ఠంగుమని కొడుతుంది. ఇది 'ఫాస్ట్' పోతోందేమోనని వదిలేశాడు. అప్పటికీ ఆయన అనుకున్న సమ

యానికి ముందే ఆరు గంటలు కొడుతూనే వుంది. ఎట్లా గయినా, తాను గెలిచి తీరాలని పట్టుదల రోజురోజుకూ ఎక్కువయి పోతోంది. ఒక్కొక్కప్పుడు, తాను చకచక నడవలేక, బస్సుకోసం పడిగాపులు కాయలేక టాక్సీమీద హడావిడిగా ఆఫీసు కెళ్ళినా, అప్పటికే ఆయిన అయిదు నిమిషాలు లేటు అని, ఆఫీసరు గడియారం వైపు చూసి చెపుతాడు. తాను రోజూ చేసేపనే సాయంత్రం అయిదు అయినా పూర్తి కావటం లేదు. ఆఫీసులో అందరూ కూడా చేతులు వూగించుకుంటూ వెళ్ళి పోతూవుంటే, ఆనందరావు, టేబులు ముందు కూర్చుని యింకా యేదో రాస్తూనే వుంటాడు. తెమలటం లేదు. ఆయనకు భయంగానూ, ఆందోళనగానూ, వుంటోంది. తెల్లారి లేచినప్పట నుంచి ప్రతిదాంట్లోనూ, వెనక్కు పోతున్నట్లు అని పిస్తోంది.

తనలో తాను తర్కించుకుంటూ సమాధానానికి వస్తున్నాడు. అవును కాలంతో పరుగెత్తటానికి మనిషికి వయస్సుండాలి. బలం వుండాలి శక్తివుండాలి. ఉత్సాహం కావాలి! ఇవన్నీ తనకు ఒకప్పుడు పుష్కళంగా వున్నాయి. ఆనాడు కాలాన్ని వెనక్కు నెట్టేసి, ముందుకు పోయిన సంఘటనలు ఎన్నో వున్నాయి. పరుగు పరుగునగంతులు వేసుకుంటూ మరీ గెలిచాడు పరుగు పందాలన్నీ ఆ శక్తంతా యేదీ యీనాడు రాత్రి అవటంతోనే, కాస్త అన్నం తిని చెయ్యి కడుక్కుంటూ వుండగానే అవలింతలు వచ్చేస్తున్నాయి పక్క వేశావా అనే కేకలో కూడ గేర వచ్చేస్తోంది. పరుగు పరుగున మంచం మీదకు వెళ్ళి పడుకుంటాడు. ఎనిమిది కొట్టక మునుపే, తాను పడుకో బోతున్నాననే గర్వమో, టైమును ఓడించాననే ధీమాయో తెలీదు. తర్వాత యెన్ని సార్లు యెన్ని గంటలు కొట్టినా

వినిపించుకోడు. చప్పగా నిద్రపోయి. పగలల్లా, విఫలమయిన తన కోరిక లన్నింటిని సంతృప్తిగా కలలో తీర్చుకుంటూ వుంటాడు. ఏమీ చెయ్యలేని అశక్తత ఆయనలో పూర్తిగా జీర్ణించుకు పోయింది. రోజు రోజుకు ఆయనకు కాలం మీద పగ, కసి ఎక్కువయి పోతున్నాయి. ఈ కాలమే నన్నింత నిర్వీర్యుణ్ణిగానూ, నిస్తేజుణ్ణిగానూ చేసింది. అసమర్థుడ్నిగా చేసేసి, నలుగుర్లో నన్ను ఎగతాళి చేశేస్తోంది ఇది నేను సహించ లేను. భరించలేను. ఇన్నేళ్ళుగా కాలంతో పాటు సహకరించి, కాలానికి అనుగుణంగా యెన్నెన్నో చేశాను. ఇంత చేసినా నామీద సానుభూతి అనేదే లేదు. ఇది మహా దారుణం. కర్కశం, జాలి, నాలి, ప్రేమ, కరుణ, దయ, మమత, అప్యాయత, అనురాగం వీటిల్లో యేదీ కూడా కాలానికి యేకోశానా లేదు అంటూ ఏదో తనలో తాను గొణుక్కుంటున్నాడు.

కాలానికి చిహ్నం గడియారం, గోడ గడియారం, అరగంట, అరగంటకు, గంట కొడుతూ ఆనందరావును ఉడికిస్తోంది. భయ పెట్టేస్తోంది. కుంగ దీసేస్తోంది. ప్రతి క్షణం కూడా, తనకు తెలియని భారాన్ని, బరువును తన మీద వేస్తోంది. ఇది యింకా మోయలేను. ఇహ కాలంతో పోటీ పడి గెలవలేను. నేను ఓడిపోయాను. అలసి పోయాను. డస్సి పోయాను. నేను ఇంకా ఈ జీవితాన్ని మోసుకు నడపలేను నా మీద వచ్చి పడే కాలం యొక్క బరువు రోజు రోజుకు ఎక్కువయి పోతోంది. నేను నడవలేను. క్షీణించి పోతున్నాను. కోలుకో లేను. నా కాళ్ళు చచ్చు పడ్డాయి. చూపు తగ్గి పోతోంది. యెంత మంది నన్ను యెన్ని మాటలన్నా నాకేమీ పరవాలేదు, నాకేవీ వినిపించవు. ఏదీ తినాలని లేదు. ఎవరితోనూ మాట్లాడాలని లేదు. ఏ పనీ చెయ్య బుద్ధి

పుట్టటం లేదు ఆలోచించటానికి ఏ విషయమూ దొరకటం లేదు. నామాట ఎవ్వరూ వినిపించుకోరు నేనూ యెవ్వరికీ అక్కర్లేదు. నాతో అందరికీ పని తీరి పోయింది. పిల్లలకు రెక్కలు వచ్చి దూరాన ఆకాశంలో ఎక్కడెక్కడో ఎగిరి పోతున్నారు నా మాట వాళ్ళకు వినిపించదు నా పిలుపు వాళ్ళకు అందదు. నా చూపు వాళ్ళమీద ఆనదు నా గొంతు అందాక వెళ్ళదు. నాకు మిగిలిందేమీ లేదు ఏ ఆశా లేదు నిరాశ అంత కంటే లేదు. నా అంతట నేను ఎక్కడికీ వెళ్ళలేను చతికిల బడి భూమి మీద కూర్చుంటున్నాను. లేవలేనుకూడా. నన్ను చూసి నవ్వకండి. ఆనందరావు ఉద్రేక పడుతూ ఊహించు కుంటున్నాడు.

ఆనాడు యెట్లాగోట్లా యింటికి వచ్చి పడ్డాడు. తన హృదయంమీద తన శరీర భారం పెద్ద బండ రాయిలాగ వచ్చి పడింది. నాలుగు వైపులా కళ్ళు తిప్పి చూశాడు. గోడ గడియారం టిక్కు టిక్కు మంటోంది. తను యెవరో ముక్కలు ముక్కలుగా ఛేదిస్తున్నట్లు ఊహించుకుని ఉలిక్కి పడ్డాడు ఎవరో కాదు కాలం అదే తనని కబళించేస్తోంది అనుకుంటూ హృదయంలో ఆరాటం పెంచుకుంటున్నాడు.

నువ్వు నిత్య యౌవ్వనివి. నీతో పోటీ పడి గెలవ లేను. నేనే కాదు. ఎవ్వరూ గెలవలేరు. నీ కంటె ముందరగా నేను పోలేను నేను చాలా వెనక పడి పోయాను. ఒకప్పుడు నేను నీకంటె ముందుగా పరుగెత్తుతున్నాననే ధీమా వుండేది. కాని ఇప్పుడదేమీ లేదు నా ధైర్యాన్ని తీసేశావు పిరికివాన్ని చేశావు.నేను కదల్లేను. నువ్వు దూర దూరాల తీరాలకు యిట్టే వెళ్ళి పోతున్నావు. నేను నిన్ను కలుసుకోవటం కష్టం. నీతో పరుగెత్త లేను. ఆగి పోతాను. అయితే

చివర శ్వాసపీల్చుకుంటూ మెల్లిగా లేవాలనివుంది నువ్వు నాకోసం ఆగవని తెలుసు. నాకోసం ఆగద్దు. నువ్వు ఎవరికోసమూ ఆగవు కనక, నువ్వెళ్ళుతూవుండు. నీతో కలుసుకుందామని వుంది అయితే ఒక్కమాట. చివర మాట. ఇది మనిద్దరి మధ్య రహస్యం. నేను ఓడిపోయానని చెప్పుకోవటం నాకిష్టం లేదు. నా ఆత్మాభిమానం దెబ్బతింటుంది. నీ దగ్గరకు వస్తున్నాను ఇహ నేను సాగలేను. ముందుకు ఒక్క అడుగు కూడా వెయ్యలేను. కనీసం నీలో కలిసి పోనీ నన్ను తీసుకువెళ్ళు. ఇదే నా ఆఖరి కోరిక అంటూ ఆనందరావు కాలాన్ని కౌగలించుకున్నాడు. కాలంలో లీనమై పోయాడు.

ఆనందరావు ఏడీ నిన్న మొన్నటిదాక ఇక్కడ కదుల్తూ వుండేవాడు. కనిపించటం లేదే మరి అంటూ నలుగురూ ప్రశ్నించుకున్నారు. మళ్ళీ సమాధానం కూడా వాళ్ళకే తట్టింది, ఒకప్పుడు ఆనందరావును కాలం చేసింది. ఈ నాడు ఆనందరావు కాలం చేశాడు అన్నారు. కాలం ఫక్కున నవ్వింది.

---